# స్త్రీలు మారాలి



బాల్కనీలో కూర్చుని, విశాలమైన ఆకాశంవంక చూస్తోంది సువర్చల. ఆకారాలను మార్చుకుంటూ సాగిపోతున్న నల్లమబ్బులు, ఆ నల్లని మబ్బులకు అందంగా రంగుల్ని అద్దుతున్న అరుణ కిరణాలు, మునిమాపువేళ గూళ్లకు చేరాలనే తొందరలో గుంపులు గుంపులుగా ఎగురుతున్న పక్షులు... అవేవీ ఆమె అంతరంగాన్ని అతలాకుతలం చేస్తున్న ఆలోచనల్ని అరికట్టలేకపోతున్నాయి. చూపరులందరికీ ఆహ్లాదాన్ని కలుగజేస్తున్న ఆ సుందర దృశ్యాలు ఆమె మనసు పొరల్లోకి చొరబడలేకపోతున్నాయి.

ఆలోచనలు! ఆలోచనలు!! ఆలోచనలు!!! అదే పనిగా ఆమెని వేధిస్తూ అశాంతికి గురిచేస్తున్నాయి. ఉదయం తన స్నేహితురాలు విజయను చూడడానికి ఆసుపత్రికి వెళ్లింది. తిరిగి వస్తూండగా అక్కడ... ఆసుపత్రిలో... పట్టుమని పాతికేళ్లయినా లేని అమ్మాయి నిర్జీవంగా స్ట్రెచర్‌పై మార్చురీ రూమ్‌లోకి తరలించబడుతోంది. ముఖంపై కప్పబడిన తెల్లగుడ్డ స్ట్రెచర్ కదలికలకు క్రిందకు జారింది. ముక్కుపచ్చలారని పసిపాపలా... ప్రశాంతంగా నిద్రిస్తున్నదానిలా వుంది ఆ అమ్మాయి. ఆ దృశ్యం చూసిన క్షణం నుంచి సువర్చల మనసుని ఆలోచనలు వేధిస్తూనే వున్నాయి. వేదనకు గురిచేస్తూనే ఉన్నాయి.

"ఏం జరిగింది?" అక్కడ ఎవరినో అడిగింది.

అతి మామూలుగావచ్చింది జవాబు. "ఆత్మహత్య!"

సూరిపండు

"కారణం?"

అత్యంత సహజంగా... అనవరతమూ జరిగిపోతున్నదే... "మగవాడి దౌష్ట్యం!" మధ్య తరగతి కుటుంబం, వయసు ప్రభావం... ఎవరినో ప్రేమించిందట. కాని క్షణంలో ఏమారింది. ఫలితం... గర్భం. కారణం తాను కాదన్నాడట ఆ మానవమృగం. అనుమానాలు... అవమానాలు... చివరికి ఈ అఘాయిత్యం!


సభ్యసమాజానికి ఇలాంటి మరణాలు ఎన్ని సవాళ్లు విసిరినా దున్నపోతుమీద వానే!

ఇంటికి వచ్చినా ఆ దృశ్యం కనుల ముందు నుంచి అదృశ్యం కావడంలేదు. ఆలోచనలు విపరీతమైన ఆలసటని కలిగిస్తున్నా వాటిని అదుపు చేసుకోలేక పోతోంది సువర్చల.

"ఆత్మహత్య చేసుకోవలసినంత తప్పు ఆ అమ్మాయి ఏమి చేసింది? తప్పనేది జరిగితే అది ఇద్దరివల్లా జరిగింది. కానీ శిక్షింపబడుతున్నది ఆడది. స్త్రీగా గుర్తింపబడే ప్రకృతే స్త్రీని శిక్షిస్తోంది. మగవాడు మాత్రం ఏ శిక్షా లేకుండా మహారాజులా చెలామణి అయిపోతున్నాడు. అంత "గొప్ప" మగవాడూ "ఆ సమయం"లో ఆ అమ్మాయి ముందు దాసోహం అంటాడు. చాటుగా... ఒంటరిగా ఎన్నో వాగ్దానాలు చేస్తాడు. అవసరమైతే ఆమె పాదాల ముందు సాగిలపడతాడు. అవసరం తీరాక ఆమెని ఒంటరిదాన్ని చేసి పోతాడు. ఎందరు దుష్యంతులో... తమ దౌష్ట్యంతో అమాయక శకుంతలలను వంచిస్తూనే వున్నారు నాటి నుంచి నేటి దాకా!

ఈ దుష్ప్రవర్తననరికట్టే తెలివే తెచ్చుకోలేక పోతోంది ఆడది. అబలను కాదు... సబలనే అని నిరూపించుకుంటున్న ఈ కాలంలో కూడా! ఇందుకు కారణం అవిద్యా?... అదే అయితే ఎందరు విద్యావంతులయిన స్త్రీలు తమ సంసారాల్లో సుఖశాంతులను అనుభవిస్తున్నారు? అవగాహనా రాహిత్యమా... కావచ్చునేమో! జీవితమంటే అవగాహనలేకపోవడం, ఆడా... మగా ఇద్దరికీ! సరైన దారిలో నడిచే జ్ఞానం కొరవడుతున్నదేమో!

పెళ్లి... భర్త... పిల్లలు... సంసారం... అదే



ఆడపిల్ల జీవితానికి పరమార్థం అనుకోవడం. ఆ పెళ్లికోసం ఎన్ని అగచాట్లు... ఎన్ని ఇక్కట్లు... ఆడపిల్లకు వరుణ్ణి వెదకడమే ఒక మహాయజ్ఞం! కట్నాలు, కానుకలు, లాంఛనాలు వగైరాలు నచ్చుబాటుచేసి ఆ వరుణ్ణి పీటలదాకా తీసుకు రావడం మరొక మహాయజ్ఞం! ఆపై అలకపాన్పులు, ఆషాడపట్టీలు, పండుగలు - పబ్బాలు, పురుళ్లు - పుణ్యాలు అదొక అసిధారావ్రతం! అలాకాక ఎవడో నాలుగు ఇచ్చకపుమాటలు చెప్పేసరికి అదే ప్రేమగా భావించి అతగాడే తన జీవితాన్నుద్ధరించే మహానుభావుడని భావించి, తన సర్వస్వాన్నీ ఆ మహాపురుషుడికి అర్పించుకోవడం! అన్నీ అనుకూలిస్తే ఆ మహెూద్దారకుడి ప్రాపకంలో బానిసగా జీవించడం, ప్రతికూలిస్తే జీవితానికి చరమగీతం పాడుకోవడం. ఇదేగా ఏ ఆడదాని జీవితమైనా!

పెద్దలు కుదిర్చినవైనా, ప్రేమించి చేసుకున్నవైనా ఒకే విధంగా పరిణమిస్తున్నాయి నేటి వైవాహిక బంధాలు. ఆ బంధాలు విబంధాలవడానికి ఎన్నో కారణాలు ప్రభావితం చేస్తున్నాయి. కొండొకచో ధనం కారణమైతే మరికొన్నింట అత్తమామలు, ఆడపడుచులు ఇత్యాదుల అధికారజులుం కారణమవుతోంది. ఏది కారణమైనా చివరికి నష్టపోయేది ఆడపిల్లే.

అబల అన్న ముద్రను ఇప్పుడిప్పుడే చెరుపుకొని, తనకంటూ ఒక వ్యక్తిత్వముందని, సమాజంలో తన కాళ్లపై తాను నిలబడి తనేమిటో నిరూపించుకుంటోంది ఒకప్రక్క. ఎంత గొప్ప చదువులు చదివినా, ఎంత విజ్ఞానాన్ని సముపార్జించినా, గొప్ప గొప్ప పదవుల్లో తన ప్రజ్ఞాపాటవాల్ని నిరూపించుకుంటున్నా మరో ప్రక్క మగవాడి దౌష్ట్యానికి, దాష్టీకానికీ బలైపోతూనే వుంది. చిన్నతనంలో తండ్రిచాటు బిడ్డగా మగపిల్లవాడితో సమంగా పెరగలేకపోతోంది. భర్త ప్రాపకంలో భార్యగా నరకాన్నే చవిచూస్తోంది. వృద్ధాప్యంలో బిడ్డల పంచన బ్రతుకు పెనంమీంచి పొయ్యిలో పడిన చందమవుతోంది.

తల్లిగా, చెల్లిగా, ఇల్లాలిగా, బిడ్డగా మమతల్ని, మనసునీ పంచియిస్తున్నా పగవాడే అవుతున్నాడు మగవాడు. జీవితం పట్ల ఆశలు ఆవిరైపోతూంటే...అమానవీయంగా దోచుకోబడుతూంటే... పరిస్థితుల్ని తనకు అనుగుణంగా మలుచుకోగలిగే విజ్ఞతను ప్రదర్శించే స్థాయికి ఎప్పటికి చేరుకోగలుగుతుంది ఆడది?

ఒక విధంగా ఆలోచిస్తే ఆడదాని జీవితం అర్థాంతరంగా ముగిసిపోవడానికైనా... అర్థవంతంగా సాగకపోవడానికైనా మగవాడితో పాటుగా మరో ఆడది కూడా కారణభూతురాలవుతోంది! అత్తగా... ఆడబడుచుగా వేధించి, వేసార్చి బ్రతుకుని చితిమంటల కాహుతిచేస్తున్నారు...

ఒక్కసారిగా సువర్చల ఆలోచనల్లో ఆమె పినతండ్రి కూతురు మంజుల చోటుచేసుకుంది. అవును! మంజుల జీవితం మంట కల్సిపోవడానికి కారణం అత్త, ఆడబిడ్డలే కదూ! ఏ ఒక్కనాడైనా భర్తతో ప్రేమగా గడపనిచ్చారా? అనుక్షణం అతడి చెవినిల్లుకట్టుకొని లేనిపోని కట్టుకథలల్లి, అపనిందలుమోపి, అనుమానగ్రస్తుణ్ణిచేసారు. ఆమెను వేధింపజేసారు.

అందానికి అందం... సంపాదనకు సంపాదన... బంగారానికి తావి అబ్బినట్లుగా! అలాంటి అమ్మాయిని చేసుకోవడానికి ఏ మగ మహానుభావుడు ముందుకురాడు? ఇంటిల్లిపాదికీ ఆమె ఎంతగానో నచ్చింది. "మీ అమ్మాయే మాకు పెద్ద కట్నం" అన్నారు. అత్త, ఆడబిడ్డలకు లాంఛనాలు జరిపిస్తే చాలునన్నారు.

"ఆడవాళ్లు కదా... ఏదో సాంప్రదాయం అంటూ వేళ్లాడుతారు కదా!" అంటూ పెద్దగా

నవ్వాడు వరుడి తండ్రి. తప్పదన్నట్టుగా బాబాయి పెదాలపైకి నవ్వుతెచ్చుకున్నాడు. అలక పాన్పుమీద బండి కొనివ్వాలన్నారు. అదనీ... ఇదనీ... మొత్తానికి అయిదులక్షలు దాటించారు లాంఛనాల పేరుతో! అన్నిటికీ అంగీకరించాడు బాబాయి. పెళ్లికొడుకు బాగున్నాడు, మంజులకి నచ్చాడు. మంచి ఉద్యోగం, ఆస్థిపాస్థులు బాగానే వున్నాయి. ఒక్కడే కొడుకు, ఆడపడుచుకు పెళ్లయింది. ఆ ఇంట్లో మంజుల సుఖపడుతుందనుకున్నారు అందరూ. అంతా అడియాసే అయింది. ఆడపడుచు అత్తవారి ఊళ్లోనే కావడంతో అత్తగారింట గడిపేది తక్కువ. పుట్టింట ఉండేది ఎక్కువ. దానితో ఒకరికొకరు తోడై తల్లీ కూతుళ్లిద్దరూ మంజులను కాల్చుకుతినేవారు. ఆమె అదృష్టమో, దురదృష్టమో... పెళ్లయిన నెలకే మంజులకు ఉద్యోగంలో ప్రమోషన్ వచ్చింది. హోదా పెరగడంతోపాటు జీతం కూడా బాగా పెరిగింది. వాటితో పాటు బాధ్యతలూ పెరిగాయి. అదే ఆమె పాలిట శాపమయింది. తనకంటే ఎక్కువ జీతం సంపాదిస్తోందన్న ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ చోటుచేసుకొంది మంజుల భర్త మనసులో. పెరిగిన ఉద్యోగ బాధ్యతలవల్ల ఇంటికి రావడం కాస్త ఆలస్యమయితేచాలు... అత్త, ఆడబిడ్డల సణుగుళ్లు. చీటికీమాటికీ సాధింపులు. ఆత్మన్యూనతా భావనతో సతమతమవుతున్న అతగాడు మంజులను తిట్టడం, గొడవపడడమే కాకుండా చేయి చేసుకొనేదాకా వచ్చింది. ఆలస్యంగా రావడానికి కారణం ఎవరితోనో సంబంధాలుండడమే అనే హీనస్థితికి దిగజారిపోయారు.

వాళ్లెంత దుర్మార్గంగా ప్రవర్తించినా తను మాత్రం శాంతంగానే వుండేది మంజుల. అతనికి నచ్చచెప్పడానికి ఎంతగానో ప్రయత్నించేది. అయినా వాళ్లలో మార్పు ఏ మాత్రం రాకపోగా రాక్షసత్వం మరింత పెరిగింది. తరచూ జరిగే గొడవలకు విసిగిపోయిందో ఏమో నిద్రమాత్రలు అధికంగా తీసుకొని దీర్ఘనిద్రలోకి వెళ్లిపోయింది! 'ముక్కలైన మనసు అతుక్కోవడం కష్టం. మా యిద్దరి మధ్యనా సయోధ్య ఏర్పడడం జరగని పని. విడాకులు తీసుకుని ఒంటరిగా బ్రతుకుని వెళ్లదీయడమో, మరో మగాణ్ణి మొగుడుగా కట్టుకోవడమో నాకిష్టంలేదు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను. నన్ను క్షమించక్కా!' అంటూ మంజుల వ్రాసిన ఉత్తరం ఇప్పటికీ తన మనసుని మెలిపెడుతూనేవుంది.

చదువుకున్నవాళ్లు, చదువులేనివాళ్లూ ఒకే తీరుగా ప్రవర్తిస్తూండడం ఎంత బాధాకరం? ఎప్పటికైనా వ్యవస్థ మారుతుందా? స్త్రీలలోనే మార్పు రావాలి. తమ ఆలోచనా విధానాన్ని మార్చుకోగలగాలి. మగవాణ్ణి సన్మార్గంలో నడిపించగలశక్తి ఒక్క స్త్రీకే ఉంది. అందుకైనా స్త్రీలు మారాలి. నిజమైన సంతోషాన్ని, సౌఖ్యాన్నీ తమ జీవితాల్లో వెల్లి విరియజేసుకోవాలి.

"ఏమిటి సువర్చలా... లైటన్నా వేసుకోకుండా బాల్కనీలో చీకట్లో కూర్చున్నావు?" అంటూ లైటు వేసాడు సువర్చల భర్త నారాయణ.

ఒక్కసారిగా బాల్కనీలో వెలుగుపరుచుకుంది. ఉలికిపాటుతో ఈలోకంలోకి వచ్చింది సువర్చల. "ఏమండీ ఈ వ్యవస్థ మారదా... ఆడదాని జీవితం బాగుపడదా?..." బేలగా అంది భర్త వంక చూస్తూ.

"ఏమిటిది సువర్చలా... ఇంకా ఉదయం సంఘటన మరచిపోలేదా?..." అంటూ కుర్చీలోంచి లేచిన ఆమెను బాహువుల్లో పొదువుకొని మెల్లగా లోపలికి నడిపించాడు నారాయణ.

లోకంలో అందరూ మంజుల భర్తలే కాదు... నారాయణలూ ఉన్నారు! ●